ANN తెలుగు
Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
02-09-2025
# మహా పత్రిక
మంగళవారం, తిరుపతి సంపుటి- 22 సంచిక- 269 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## అణుబాంబు కాదు.. ఈసారి హైడ్రోజన్ బాంబు పేల్చుతాం
### ఓటు చోరీపై రాహుల్ గాంధీ

**బీహార్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటు చోరీపై అణుబాంబు కాదు.. ఈ సారి హైడ్రోజన్ బాంబు పేల్చుతామంటూ ప్రకటించారు. ఓటు చోరీ నినాదాలు చైనాలో చైనాలో మోగుతున్నాయని.. ఓటు చోరీ స్కాంను బయటపెట్టిన తర్వాత ప్రధాని మోదీ ప్రజలను ఎదుర్కోలేకపోతున్నారని అన్నారు. బీజేపీ నేతలకు ఒక విషయం చెప్పాలనుకుంటున్నా.. మీరు అణుబాంబు కంటే పెద్దదాని గురించి విన్నారా.. అది హైడ్రోజన్ బాంబు. హైడ్రోజన్ బాంబు త్వరలోనే పేలబోతోంది. రెడీగా ఉండండి.. త్వరలోనే ఓట్ల చోరీకి సంబంధించిన అన్ని నిజాలు బయటికి వస్తున్నాయి.. అని అన్నారు. ఒక్కసారి హైట్రోజన్ బాంబు పేలితే నరేంద్ర మోదీ ఈ దేశ ప్రజలకు తన మొహం కూడా చూపించలేరని రాహుల్ అన్నారు. ఓట్ చోర్.. గద్దీ ఛోడ్ .. అనే నినాదాలు ఇచ్చామని.. అది ఇప్పుడు చైనాలో కూడా ప్రతిధ్వనిస్తోందని అన్నారు. ఇప్పుడు అమెరికాలో కూడా ప్రజలు ఓట్ చోర్ గురించి మాట్లాడుకుంటున్నట్లు చెప్పారు.

**టాప్ న్యూస్**

సుదర్శన్ రెడ్డి ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే
### మన ప్రతిష్ట పెరుగుతుంది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- బాబు, కేసీఆర్, జగన్, పవన్ లకు విజ్ఞప్తి




02

### సీబీఐ విచారణపై సస్పెన్స్
- ఆసక్తికరంగా కేంద్రం నిర్ణయం



02

### ఉపరాష్ట్రపతి పదవి.. రాజకీయ పదవి కాదు
- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి
- నాకు ఏ పార్టీలో సభ్యత్వం లేదు
- ఇకపై ఏ పార్టీ సభ్యత్వం తీసుకోను



02

# హరీష్.. సంతోష్ అవినీతి అనకొండలు
## కేసీఆర్‌పై అవినీతి మరకకు వీరే కారణం





నా తండ్రి ధ్యాస తెలంగాణ.. వీరి ధ్యాస పైసల కక్కుర్తి
మేఘా కృష్ణారెడ్డితో కలిసి ఈ పని చేశారు..
అందుకే హరీష్ ను ఇరిగేషన్ నుండి తప్పించారు
హరీష్, సంతోష్ లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండ
కేసీఆర్ దాకా వచ్చాక పార్టీ ఉంటే ఏంటి? పోతే ఏంటి?
కేసీఆర్ పై సీబీఐ వేస్తే.. తెలంగాణ బంద్ కు ఎందుకు పిలుపివ్వలే?
మా నాన్నను అడ్డు పెట్టుకొని ఆస్తులు పెంచుకున్నరు
రేవంత్.. వాళ్లపై డైరెక్టుగా ఎంక్వైరీ వేస్తే నిజాలు బయటికొస్తయ్
సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తే తోలు తీస్తా ఖబడ్దార్ బిడ్డా
కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటికొస్తరు
విలేకరుల సమావేశంలో కల్వకుంట్ల కవిత ..ప్రెస్ మీట్ లోనే కన్నీరు

**హైదరాబాద్, మహా :** కాళేశ్వరం విషయంలో ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు పాత్ర లేదా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. మహానాయకుడైన కేసీఆర్ పై అవినీతి మరక పడడానికి హరీష్ రావు, సంతోష్ రావులే కారణమని ఆరోపించారు. సోమవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటుచేసిన కవిత సంచలన వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో సెగలు పుట్టించారు. బీఆర్ఎస్ పార్టీలో మాజీ మంత్రి హరీశ్ రావు, సంతోష్ రావు అవినీతి అనకొండలని, తనతండ్రి కేసీఆర్ దేవుడి లాంటి వారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు.

వివరాలు 3లో

### కేసీఆర్‌తో కీలక నేతల భేటీ
- హరీష్ వెంటే పార్టీ.. కవిత పై వేటే?.. కవిత వ్యాఖ్యలపై.. కలకలం
- కవిత పీఆర్వోను పార్టీ అధికారిక గ్రూపు నుండి తొలగింపు
- ఆరడుగుల బుల్లెట్టు అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్ట్
- దీనిని షేర్ చేసి సంఘీభావం ప్రకటించిన కేటీఆర్

వివరాలు 3లో

### సీబీఐ అనగానే ఎందుకు జంకుతున్నారు?
- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్
- కాళేశ్వరం అవినీతి తేలిపోయింది
- కవితే నిర్ధారించింది

03



### బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు పట్ల కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు
కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సేవాభవన్ నుండి ర్యాలీ
కాంగ్రెస్ ప్రముఖుల ఫ్లెక్సీలకు పాలాభిషేకం
ఇది చారిత్రాత్మక నిర్ణయమన్న కంది శ్రీనివాస రెడ్డి
బీసీలకు తగిన సత్కారమని వెల్లడి

03

### కాళేశ్వరంపై కుట్ర.. నీళ్లన్నీ ఆంధ్రాకే: కేటీఆర్ ఫైర్
కాళేశ్వరం దర్యాప్తును సీబీఐకి అప్పగించాలనుకోవడంపై తీవ్ర ఆగ్రహం
రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల ఆందోళనలకు బీఆర్ఎస్ పిలుపు

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం ప్రాజెక్టు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలనుకోవడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని, తెలంగాణ జీవనాడి అయిన ఈ ప్రాజెక్టును శాశ్వతంగా మూసివేసి గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకే సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పాటు ఆందోళనలు చేపట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.




మిగతా 2లో

### శాసన మండలిలో రచ్చ రచ్చ
చైర్మన్‌పై పేపర్లు విసిరిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు
బీసీలకు అవకాశాలు పెరగాలని తీన్మార్ మల్లన్న డిమాండ్

03

SRI GOLD
TRUSTED GOLD BUYERS

| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,05,880 |
| 22 క్యారెట్ | 97,050 |
| సిల్వర్ (కేజీ) | 1,26,000 |



# కాళేశ్వరంపై కుట్ర.. నీళ్లన్నీ ఆంధ్రాకే...

## కేటీఆర్ ఫైర్

కాళేశ్వరం దర్యాప్తును సీబీఐకి అప్పగించాలనుకోవడంపై తీవ్ర ఆగ్రహం

రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల ఆందోళనలకు బీఆర్ఎస్ పిలుపు



(మొదటిపేజీ తరువాయి)

ఈ మేరకు పార్టీ నేతలతో సోమవారం ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగించడం అంటే, దానిని పూర్తిగా మూసివేయడమేనని అన్నారు. "ఇది కేవలం కేసీఆర్‌పై జరుగుతున్న దాడి కాదు. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసి, కాళేశ్వరాన్ని ఎండబెట్టి, మన నీటిని పక్క రాష్ట్రాలకు తరలించే పెద్ద కుట్ర" అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి ఈ కపట నాటకం ఆడుతున్నాయని, ఈ రెండు పార్టీల కుట్రలను సమర్థంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. నిన్నటి వరకు సీబీఐని వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి, ఒక్కరోజులోనే మాట మార్చడం వెనుక ఉన్న శక్తులు ఏంటో ప్రజలకు తెలియాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### సుదర్శన్ రెడ్డి ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే

# మన ప్రతిష్ట పెరుగుతుంది

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బాబు, కేసీఆర్, జగన్, పవన్ లకు విజ్ఞప్తి

**హైదరాబాద్ , మహా:** జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే మన ప్రతిష్ట ఢిల్లీ స్థాయిలో పెరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇండీ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డితో రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో తెలుగు ప్రజల ఉనికి ప్రమాదంలో పడిందని, జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించామని రేవంత్ రెడ్డి అన్నారు. ఇండీ కూటమి ఆలోచనను జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గౌరవించి ఎన్నికల బరిలో నిలిచారని, సుదర్శన్‌రెడ్డి ఎన్నికల బరిలో నిలవడంతో ఎన్‌డీఏ కూటమికి బలమైన సవాల్ విసిరామని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు రద్దు చేయాలనేది ఎన్‌డీఏ కూటమి యత్నమని, రాజ్యాంగాన్ని పరిరక్షించి పేదలకు రిజర్వేషన్లు పెంచాలనేది ఇండీ కూటమి యత్నమని సీఎం తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఇండీ కూటమి ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. ఇటీవల ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామా అందరినీ ఆశ్చర్యం కలిగించిందని, ఉపరాష్ట్రపతి రాజీనామాకు ఒత్తిడి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఈ తరుణంలో ఉపరాష్ట్రపతి ఎన్నికకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడిందని, రాజ్యాంగం మార్చి, రిజర్వేషన్లు రద్దు చేయాలనే అజెండాతో ఎన్‌డీఏ అభ్యర్థిని నిలిపారని ఆరోపించారు. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలు ఎప్పుడైనా మాట్లాడవచ్చని అన్నారు. తెలుగు వ్యక్తి రాజ్యాంగ నిపుణుడికి ఒక అవకాశం వచ్చిందని, తెలుగు వారి గౌరవం, ప్రతిష్ట పెంపొందించేందుకు అభ్యర్థిని నిలిపామని, రాజకీయాలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి అండగా నిలబడాలని కోరారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, అసదుద్దీన్‌కు విజ్ఞప్తి చేస్తున్నానని, ఎంపీలు ఆత్మ ప్రబోధానుసారం ఓటు వేయాలని కోరుతున్నానని అన్నారు. కాగా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ , మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు తెలంగాణ ఎంపీలు జస్టిస్ సుదర్శన్ రెడ్డిని కలిశారు.

# సీబీఐ విచారణపై సస్పెన్స్

## ఆసక్తికరంగా కేంద్రం నిర్ణయం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ప్రభుత్వం కోరుతున్న 'కాళేశ్వరం ప్రాజెక్టు సీబీఐ విచారణ' అంశంపై కేంద్ర నిర్ణయం ఆసక్తికరంగా మారింది. పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టులో బీజేపీ ఎంపీ, బీఆర్ ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ పేరు ఉంది. దీంతో సొంత నేతపై ఆరోపణలున్న కేసు దర్యాప్తుకు అప్పగిస్తే సెల్ఫ్ గోల్ అవుతుందా? వెయిట్ చేస్తే కాంగ్రెస్ విమర్శలతో ఎక్కువ డ్యామేజ్ అవుతుందా? తదితర అంశాలు లెక్కలేసుకున్నాకే సీబీఐ ఎంట్రీపై నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా సోమవారం దీనిపై కేంద్రానికి లేఖ రాయలేదు. త్వరలో రాస్తామని సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ సందర్భంగా అన్నారు.

# సహాయక.. మరమ్మతు పనులు వేగవంతం చేయండి

- వర్షాలు, వరదలతో నష్టాలపై సమగ్ర వివరాలతో రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలి
- సమగ్ర నివేదికతో ఢిల్లీకి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బృందం
- మృతుల కుటుంబాలకు, పశువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం విడుదల
- తీవ్రంగా నష్టపోయిన జిల్లాల కలెక్టర్లకు తక్షణ ఉపశమనం కింద రూ.10 కోట్లు
- గతేడాది వరద పరిహారం.. ఇతర వివరాలపై ఆరా
- విపత్తుల సమయంలో కలెక్టర్లు, ఎస్పీలు తక్షణమే రంగంలోకి దిగాలి
- వరదలపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- నీటి వినియోగదారుల సంఘాల పునరుద్ధరణపై నివేదికకు ఆదేశం...

**హైదరాబాద్:** ఇటీవల భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యుత్ సబ్ స్టేషన్ల పునర్నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధులు (ఎస్డీఆర్ఎఫ్) నిధులున్నా నిబంధనల ప్రకారం వాటిని వ్యయం చేయడంలో అలసత్వం చూపడంపై ముఖ్యమంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లినా కేంద్రం నుంచి సరైన సహాయం అందకపోవడంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. గతంలో కేంద్రం ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడం... గతేడాదికి సంబంధించి రావల్సిన నిధులు.. ప్రస్తుతం వ్యవసాయ, పశు సంవర్ధక, నీటిపారుదల, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, వైద్యారోగ్య, విద్యుత్ శాఖల పరిధిలో వాటిల్లిన నష్టంపై సమగ్ర నివేదికలు రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ రెండు నివేదికలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని బృందం ఈ నెల నాలుగో తేదీన ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి అందజేస్తుందని సీఎం తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో వాటిల్లిన నష్టాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సచివాలయంలో సోమవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు.

వరదలతో రాష్ట్రవ్యాప్తంగా 257 చెరువులు, కుంటలకు గండి పడిందని అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి స్పందిస్తూ చిన్న నీటి పారుదల విభాగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆర్ఆర్ఆర్, ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకొని చిన్న నీటి వనరులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని సీఎం సూచించారు. గతంలో నీటి వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల వారీగా సంఘాలు ఉండేవని సీఎం గుర్తు చేశారు. నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించిన నిబంధనలు పరిశీలించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు నూతన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. నివేదికపై మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపారు.

తమ ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్రంలోని 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. రెండు రోజుల్లో పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక సమర్పిస్తే కేంద్రం దృష్టికి తీసుకెళతామని సీఎం తెలిపారు. నీట మునిగిన సబ్ స్టేషన్ల స్థానంలో అధునాతన సామగ్రి, సామర్థ్యంతో కూడిన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌కు సీఎం ఆదేశించారు. పురపాలక, పంచాయతీరాజ్, జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాల నిర్వహణ, ఏర్పాటుపై సమీక్ష నిర్వహించి పరిష్కారంతో రావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు సీఎం సూచించారు. చెంగిచర్లతో పాటు జియాగుడ, అంబర్ పేటలోని స్లాటర్ హౌస్‌ల్లో హలాల్, జట్కా సక్రమంగా జరిగేలా చూడాలని.. అధునాతన యంత్రాలు వాడేలా చూడాలని.. అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండాలని, మాంసం విక్రేతలు అన్ని నిబంధనలు పాటించేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, తాగు నీటి సరఫరా, పశు సంవర్ధక శాఖలు సమగ్ర నివేదికలు రూపొందించి రెండు రోజుల్లో అందజేయాలని సీఎం ఆదేశించారు.



రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నూతన వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, ఆసుపత్రుల భవనాల పనులు వేగవంతం చేయడంతో పాటు వాటి ప్రారంభానికి తేదీలు నిర్ణయించాలని ఆ శాఖ కార్యదర్శి క్రిసియానా జోంగ్తూని సీఎం ఆదేశించారు. కామారెడ్డి, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లతో సీఎం మాట్లాడి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. సహాయక పనులు వేగవంతం చేయాలని, పరిహారాలు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు ఎస్డీఆర్ఎఫ్ నిధులను సక్రమంగా వినియోగించడంతో పాటు సకాలంలో వినియోగితా పత్రాలు (యూసీ) సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. విపత్తు సమయాల్లో స్పందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్ దళాలు వరదల సమయంలో మెరుగైన సేవలు అందించడంపై ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. భారీ వర్షాల సమయంలో 42 ఆపరేషన్లలో పాల్గొని 217 మందిని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించడంపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సిబ్బందికి మరింత మెరుగైన శిక్షణ, నైపుణ్యాలు అందేలా చూడాలని రాష్ట్ర అగ్నిమాపక, విపత్తు స్పందన, పౌర సహాయక విభాగం డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డికి సీఎం సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగానికి కావల్సిన అధికారులు, సిబ్బందిని వెంటనే సర్దుబాటు చేయాలని సీఎస్‌కు సీఎం సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులతో మున్ముందు అకాల వర్షాలు, వరదలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తంగా ఉండడంతో పాటు విపత్తుల సమయంలో తక్షణమే క్షేత్ర స్థాయికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాల్లో పనులకు కంటింజెంట్ కింద కలెక్టర్లకు రూ.10 కోట్లు, సాధారణ నష్టం వాటిల్లిన జిల్లా కలెక్టర్లకు రూ.5 కోట్ల చొప్పున నిదులు విడుదల చేస్తామని సీఎం తెలిపారు. సమీక్షలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకాటి శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, కె.ఎస్.శ్రీనివాసరాజు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి కె.మాణిక్ రాజ్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, డీజీపీ డాక్టర్ జితేందర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కవిత ఒప్పుకుంటున్నారు

## కాళేశ్వరంపై ఆమె వాస్తవాలు చెప్పారు

ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి

**హైదరాబాద్,మహా:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగినట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఒప్పుకొన్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అవినీతి జరిగినట్లు కవిత చెప్పకనే చెప్పారన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పీసీ ఘోష్ నివేదికను బలపరుస్తున్నట్లుగా కవిత మాట్లాడారు. నిన్న అసెంబ్లీలో చర్చను ఆమోదించినట్లు మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నాం. కారకులు ఎవరనే విషయం పక్కనపెడితే కాళేశ్వరంలో స్కామ్ జరగడం నిజం. కేసీఆర్ సీఎంగా, హరీశ్ ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడు స్కామ్ జరిగింది. యూరియా కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుంటే ఎందుకు భారత రాష్ట్ర సమితి నాయకులు రాలేదు. బీసీల విషయంలో గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది'' అని చామల ఆరోపించారు.





# దయ్యాలు వీరే..

## కవిత వ్యాఖ్యలు నిజమే

కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి

**హైదరాబాద్, మహా;** కవిత కేసీఆర్ కూతురని, ఎవరో మాట్లాడిస్తారని నేను అనుకోనని ఎంపీ మల్లు రవి అన్నారు. 'ఆమె మొదట్లో కొన్ని బాంబులు వేసింది ఇప్పుడు మళ్ళీ బాంబులు వేస్తుంది. గతంలో చెప్పిన దయ్యాలు ఎవరు అనేది బయటికి తెలిసిపోయింది. అవినీతి వెనుక హరీష్‌రావు, సంతోష్‌రావు ఉన్నారని చెప్పింది. అయినా అక్కడ అవినీతి జరిగిందని ప్రధానమంత్రి చెప్పారు, కేంద్ర బృందం మొత్తం వచ్చి చెప్పింది. దానికి తగ్గట్టుగానే సిబిఐ విచారణకి మా ప్రభుత్వం కోరింది. ఇక రేవంత్ రెడ్డి ఉన్నాడన్న విడ్డూరం ఇప్పుడు కేంద్రమే సిబిఐ ఏ చెప్తుంది కదా ఎవరున్నారు వెనకా అనేది. ఏం అవినీతి చేయకపోతే కేసీఆర్ బయటికి వస్తారు. అని అన్నారు.

# స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన

## ఎత్తివేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్

**హైదరాబాద్, మహా:** ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది సంతానం ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయరాదనే నిబంధనను ఎత్తివేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. సోమవారం మండలిలో మాట్లాడిన ఆయన.. ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేస్తే ఎన్నికల్లో పోటీ చేసేందుకు మా బీసీలు, ఎస్సీలు, ఎస్టీల్లోని మరింత మందికి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలన్నారు. బీసీల అంశంపై సభలో చర్చ జరుగుతుంటే బీఆర్ఎస్ అడ్డుతగలడం సరికాదన్నారు. 70 ఏళ్లుగా బీసీలకు అన్యాయం జరుగుతోందని ఈ సభ కనీసం మా బాధ వినాలన్నారు.



# అలా చదివితేనే.. తెలంగాణలో లోకల్

## సుప్రీంకోర్టు సంచలన తీర్పు

రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట

**ఢిల్లీ:** తెలంగాణ లోకల్ రిజర్వేషన్ కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. తెలంగాణలో వరుసగా 9,10,11,12 తరగతులు చదివితేనే లోకల్ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనం తీర్పును ఇచ్చింది. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో, తెలంగాణ లోకల్ రిజర్వేషన్ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించింది. ఈ సందర్భంగా వరుసగా నాలుగేళ్లు చదివితేనే స్థానిక రిజర్వేషన్ వర్తిస్తుందన్న తెలంగాణ ప్రభుత్వ జీవో నెంబర్33ని సుప్రీంకోర్టు సమర్థించింది. స్థానిక రిజర్వేషన్ల అంశంపై ప్రతి రాష్ట్రానికి నిబంధనలను తయారు చేసుకునే అధికారం ఉందని కోర్టులో తెలంగాణ ప్రభుత్వం వాదించింది. వాదనలను ధర్మాసనం ఒప్పుకుంది. ఈ అంశాన్ని సవాల్ చేసిన విద్యార్థుల పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. అయితే గత ఏడాది ఇచ్చిన మినహాయింపుతో ప్రయోజనం పొందిన విద్యార్థులను అలాగే కొనసాగించాలని ధర్మాసనం సూచించింది. కాగా, ఎంబీబీఎస్, బీడీఎస్, యూజీ కోర్సులకు లోకల్ కోటా రిజర్వేషన్ తీర్పు వర్తించనుంది.

# మేము సిద్ధం

## ప్రభుత్వం సహకరిస్తే ఎన్నికల నిర్వహణకు సిద్ధం..

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం

**హైదరాబాద్, మహా:** నిర్మల్ పురపాలక గడువు మార్చితో ముగిసినా ఎన్నికలు నిర్వహించట్లేదంటూ దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. వార్డుల విభజన పూర్తి చేసి ప్రభుత్వం సహకారం అందిస్తే ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. నిర్ణయం చెప్పడానికి గడువు కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను మంగళవారానికి (నేటికి) వాయిదా వేసింది.






# ఉపరాష్ట్రపతి పదవి.. రాజకీయ పదవి కాదు: జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

## నాకు ఏ పార్టీలో సభ్యత్వం లేదు.. ఇకపై ఏ పార్టీ సభ్యత్వం తీసుకోను

**హైదరాబాద్ మహా:** ఉపరాష్ట్రపతి పదవి.. రాజకీయ పదవి కాదని ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత సంవిధానంతో 53 ఏళ్లుగా తన ప్రయాణం కొనసాగుతోందన్నారు. ''ఉపరాష్ట్రపతి బాధ్యత మోయగలుగుతానా? అనే సందిగ్ధావస్థలో ఉన్నాను. రాజకీయ ముళ్ల కిరీటాన్ని నెత్తిన పెట్టుంకుంటున్నారేంటని చాలా మంది అడిగారు. న్యాయశాస్త్ర పెనుబంధాన్ని ఎందుకు వీడుతున్నారని ప్రశ్నించారు. నా ప్రయాణంలో ఎలాంటి బ్రేక్ లేదు.. కొనసాగింపే ఉంది. అందుకే నేను రాజకీయాల్లో ప్రవేశించలేదు. నాకు ఏ పార్టీలో సభ్యత్వం లేదు. ఇకపై ఏ పార్టీ సభ్యత్వం తీసుకోను. దేశ పౌరుడిగా క్రమం తప్పకుండా ఎన్నికల్లో పాల్గొంటాను. పౌర సమాజం ప్రతినిధిగా పౌరహక్కులు, సామాజిక న్యాయం, వివిధ సమస్యలపై మాట్లాడతాను.రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు అమలు చేసే ప్రభుత్వాల సిద్ధాంతాలకు చెందిన వ్యక్తిని. ప్రాథమిక హక్కులతో పాటు ఆదేశిక సూత్రాలు అమలు చేసే బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. వనరుల సంపద ఎవరి చేతుల్లో కేంద్రీకృతం కాకుండా ప్రణాళికలు రచించాలి''అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

# ఈసారి బతుకమ్మ గిన్నిస్

- వేయిస్తంభాల గుడిలో బతుకమ్మ వేడుకలు ప్రారంభం
- 29న ఎల్బీ స్టేడియంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు.. రికార్డు ఖాయం
- మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క

**హైదరాబాద్, మహా:** బతుకమ్మ పండుగను గొప్ప కార్నివాల్‌గా నిర్వహిస్తామని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈనెల 21 నుంచి 30 వరకు బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.'ఈనెల 21న వేయిస్తంభాల గుడిలో బతుకమ్మ వేడుకలు ప్రారంభమవుతాయి. గిన్నిస్ బుక్ రికార్డ్స్ సాధించే లక్ష్యంతో ఈనెల 29న ఎల్బీ స్టేడియంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తాం.

**దేశవిదేశాలకు తెలిసేలా చేస్తాం..**

పీపుల్స్ ప్లాజాలో మహిళా స్వయం సహాయక సంఘాలతో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో విద్యార్థులంతా పాల్గొనేలా వేడుకలుంటాయి. బతుకమ్మకు జాతీయస్థాయి ప్రచారం కోసం కొన్ని విమానయాన సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నాం 'అని మంత్రి జూపల్లి తెలిపారు.బతుకమ్మ వేడుకల ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రచారం కల్పిస్తామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ పండుగ గురించి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గురించి దేశవిదేశాలకు తెలిసేలా చేస్తామన్నారు. పర్యాటకశాఖ, మహిళలను భాగస్వామ్యం చేస్తూ వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు.

# మరో 15 ఏళ్లు అధికారం మాదే

## కేసీఆర్, కవిత గొడవలో తలదూర్చం.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, మహా:** భారత రాష్ట్రసమితి పని అయిపోయినట్లేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోతే హరీశ్‌రావు ఊరుకోరని, వేరే పార్టీ పెట్టుకుంటారని వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ''పార్టీనేతలు కొందరు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. కవిత విషయంపై రేపు ఆలోచిద్దామని ఆయన అన్నారట. కేసీఆర్, కవిత కుటుంబ గొడవలో తలదూర్చం. కాంగ్రెస్, సీఎంపై మాట్లాడితే సహించేది లేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరినట్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చింది. దీనిపై విచారణ జరపాలని సీబీఐకి కూడా అప్పగించాం. అవినీతి చేసినవాళ్లెవరో సీబీఐ విచారణలో తెలుస్తుంది. రాష్ట్రంలో మరో 15 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది.'' అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.



# వరద నష్టంపై నివేదిక ఇవ్వండి

## ప్రాణాలు, పశువులు కోల్పోయిన కుటుంబాలకు పరిహారం

**తక్షణమే పరిహారం విడుదల చేయాలని కలెక్టర్లను ఆదేశిస్తున్నా: సీఎం రేవంత్ రెడ్డి**

**నిధులున్నా విడుదల చేయకపోవడంతో ముఖ్యమంత్రి ఆగ్రహం**

**ఉమ్మడి జిల్లాల్లో వర్షా లతో వాటిల్లిన తీవ్ర నష్టంపై సీఎం ఆరా**

**హైదరాబాద్, మహా:** ఇటీవలి భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యుత్ సబ్ స్టేషన్ల పునర్నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధులు నిధులున్నా నిబంధనల ప్రకారం వాటిని వ్యయం చేయడంలో అలసత్వం చూపడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వర్షాలు, వరదలతో తలెత్తిన పరిస్థితులు, ఆయా ప్రాంతాల్లో వాటిల్లిన నష్టాలపై డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరదల సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, పశువులు కోల్పోయిన కుటుంబాలకు తక్షణమే పరిహారం విడుదల చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. గతేడాది ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలతో వాటిల్లిన తీవ్ర నష్టానికి కేంద్రం నుంచి రావలసిన సహాయం అందకపోవడంపై ఆరా తీసిన ముఖ్యమంత్రి గారు ఆ వివరాలతో పాటు ప్రస్తుత వరదల నష్టానికి సంబంధించిన వివరాలతో సమగ్రమైన నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని బృందం ఈ నెల 4 వ తేదీన ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి ఆ రెండు నివేదికలకు అందజేస్తుందని చెప్పారు. వరదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 257 చెరువులు, కుంటలకు గండి పడినట్టు అధికారులు చెప్పగా, ముఖ్యమంత్రి గారు స్పందిస్తూ, చిన్న నీటి పారుదల విభాగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆర్ఆర్ఆర్, ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకొని చిన్న నీటి వనరులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు. గతంలో నీటి వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల వారీగా సంఘాలు ఉండేవి. ఆ సంఘాలకు సంబంధించిన నిబంధనలు పరిశీలించి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు నూతన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని, దానిపై మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు రూపొందించిన ప్రాథమిక అంచనాలపై స్పందిస్తూ రెండు రోజుల్లో పూర్తి వివరాలతో సమగ్ర నివేదిక సమర్పిస్తే కేంద్రం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. నీట మునిగిన సబ్ స్టేషన్ల స్థానంలో అధునాతన సామగ్రి, సామర్థ్యంతో కూడిన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు.



# హరీష్.. సంతోష్ అవినీతి అనకొండలు

## కేసీఆర్‌పై అవినీతి మరకకు వీరే కారణం





- నా తండ్రి ధ్యాస తెలంగాణ.. వీరి ధ్యాస పైసల కక్కుర్తి
- మేఘా కృష్ణారెడ్డితో కలిసి ఈ పని చేశారు..
- అందుకే హరీష్ ను ఇరిగేషన్ నుండి తప్పించారు
- హరీష్, సంతోష్ లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండ
- కేసీఆర్ దాకా వచ్చాక పార్టీ ఉంటే ఏంటి? పోతే ఏంటీ?
- కేసీఆర్ పై సీబీఐ వేస్తే.. తెలంగాణ బంద్ కు ఎందుకు పిలుపివ్వలే?
- మా నాన్నను అడ్డు పెట్టుకొని ఆస్తులు పెంచుకున్నరు
- రేవంత్.. వాళ్లపై డైరెక్టుగా ఎంక్వైరీ వేస్తే నిజాలు బయటికొస్తయ్
- సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తే తోలు తీస్తా ఖబడ్దార్ బిడ్డా
- కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటికొస్తరు
- విలేకరుల సమావేశంలో కల్వకుంట్ల కవిత ..ప్రెస్ మీట్ లోనే కన్నీరు

**హైదరాబాద్, మహా**

కాళేశ్వరం విషయంలో ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు పాత్ర లేదా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. మహానాయకుడైన కేసీఆర్ పై అవినీతి మరక పడడానికి హరీష్ రావు, సంతోష్ రావులే కారణమని ఆరోపించారు. సోమవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటుచేసిన కవిత సంచలన వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో సెగలు పుట్టించారు. బీఆర్ఎస్ పార్టీలో మాజీ మంత్రి హరీశ్ రావు, సంతోష్ రావు అవినీతి అనకొండలని, తనతండ్రి కేసీఆర్ దేవుడి లాంటి వారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మాజీ ఎంపీ సంతోష్ కుమార్, హరీశ్‌రావు, మేఘా ఇంజినీరింగ్ వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు వచ్చిందని కవిత ఆరోపించారు. కేసీఆర్ జనం కోసం పనిచేస్తే వాళ్లు సొంత ఆస్తులు పెంపు కోసం పని చేశారని ఆమె మండిపడ్డారు. హరీశ్‌రావు, సంతోష్ తనపై ఎన్నో సార్లు కుట్రలు చేశారని కవిత ఆరోపించారు. తనపై ఎన్ని కుట్రలు చేసినా ఏం మాట్లాడినా నోరు మెదపలేదని, కానీ ఈరోజు కేసీఆర్ బిడ్డగా ఎంతో బాధపడుతున్నట్లు తెలిపారు. హరీశ్‌రావు, సంతోష్ వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని కవిత విమర్శించారు. తనపై సోషల్ మీడియాలో అడ్డగోలు రాతలు రాయిస్తున్న హరీశ్, సంతోష్ వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని కవిత ఆరోపించారు. వాళ్లకు బ్యాచ్ లు ఉన్నాయని అన్నారు. తాను భయపడబోనంటూ హరీశ్, సంతోష్‌లకు కవిత సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరంపై సీబీఐ ఎంక్వైరీ చేస్తున్నట్టు ప్రకటిస్తే తెలంగాణ బంద్ కు ఎందుకు పిలుపు ఇవ్వలేదని ప్రశ్నించారు.

**అందుకే హరీష్ మంత్రి పదవి తొలగించారు**

"నా తండ్రి కేసీఆర్‌కి తిండి, డబ్బు మీద ఎప్పుడూ ఆశ ఉండదు. తరతరాల సంపాదనను తెలంగాణ ప్రజలకు అంకితం చేశారు. అలాంటి మహానాయకుడిపై అవినీతి ముద్ర వేయడానికి సీబీఐ ఎంక్వైరీ పెట్టడం చూసి నా గుండె మండిపోతోంది" అని అన్నారు. ఎవరి వల్ల, ఎందుకోసం మాజీ సీఎం కేసీఆర్‌కు అవినీతి మరక అంటిందో గుర్తించాలని ఆమె సూచించారు. కేసీఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్ల ఆయనకు చెడ్డపేరు వచ్చిందని అన్నారు. "కాళేశ్వరం వ్యవహారంలో కేసీఆర్‌కి మరక పడేలా చేసిన వారిలో మాజీ మంత్రి హరీష్‌రావు, సంతోష్ రావు కీలక పాత్ర పోషించారు. అందుకే హరీశ్ రావును రెండో సారి ఇరిగేషన్ మంత్రిగా తొలగించారు. వీరిద్దరు కలిసి నా మీద కూడ కుట్ర పన్నారు.. వీరి వెనక సీఎం రేవంత్ రెడ్డి నిలబడి ఉన్నారు.. పార్టీ అంతర్గతంగా కొందరు కావాలనే కుట్రలు పన్నారు" అని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు

**కేసీఆర్ పక్కనున్న వారి వల్లే**

కాళేశ్వరంలో చిన్న భాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయినట్టు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు, సంతోష్ మధ్య లోపాయకారి ఒప్పందం ఉందని విమర్శించారు. హరీశ్‌రావు, సంతోష్‌ను రేవంత్ ఏమీ అనరని, తన తండ్రిపైనే బాణం వేస్తారని అన్నారు. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏమిటీ? లేకపోతే ఏంటీ? కేసీఆర్ దాకా వచ్చాక పార్టీ ఉంటే ఏంటి? పోతే ఏంటీ? ప్రశ్నించారు. ఇది తన తండ్రి పరువుకు సంబంధించిందని అన్నారు. తన లేఖ బయటకు వచ్చినా తాను ఎవరి పేర్లు బయటపెట్టలేదని స్పష్టం చేశారు.

**డబ్బుపై కేసీఆర్ కు ఏనాడూ ఆశలేదు**

రేవంత్ రెడ్డి ప్రిప్లాన్‌డ్‌గా సీబీఐ పేరు చెప్పారని, తాము కచ్చితంగా నిజాం బాటలోనే నడుస్తామని అన్నారు. నిజాం కట్టిన నిజాంసాగర్ నీళ్లే కదా మనం తాగుతున్నామని, కేసీఆర్‌పై సీబీఐ విచారణకు కారణం హరీశ్‌రావు, సంతోష్ అని విమర్శించారు. ఈ వయసులో కేసీఆర్ సీబీఐ విచారణ ఎందుకు ఎదుర్కోవాలని ప్రశ్నించారు. హరీశ్‌రావు, సంతోష్ తనపై ఎన్ని కుట్రలు చేసినా భరించానని, తనపై వ్యక్తిగతంగా దాడులు చేసినా వాళ్ల పేర్లు ఎప్పుడూ చెప్పలేదని, తన మాటల వల్ల బీఆర్ఎస్ శ్రేణులకు కోపం రావొచ్చని తెలిపారు. అప్పుడప్పుడూ వాస్తవాలు మాట్లాడుకుని మందు తీసుకుంటేనే ఆరోగ్యానికి మంచిదని చెప్పారు. కేసీఆర్ రాజకీయాల్లో ఇన్నేళ్లు ఉన్నా ఆస్తులు సంపాదించుకోలేదని, డబ్బులపై కేసీఆర్‌కు ఏనాడు ఆశ లేదని పేర్కొన్నారు.

**సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తే.. తోలు తీస్తా**

కాళేశ్వరంలో పనిచేసిన ముగ్గురు ఇంజినీర్ల వద్ద వందలకోట్ల సంపద ఉందని, కాళేశ్వరం ఇంజినీర్ల ఆస్తులపై ఎందుకు విచారణ జరిపించట్లేదని, ఏసీబీకి చిక్కిన ఇంజినీర్ల వెనుక ఎవరున్నారో ఎందుకు విచారణ చేయట్లేదని కవిత నిలదీశారు. బీఆర్ఎస్‌ను ఇబ్బందులకు గురిచేసిన అవినీతి అనకొండలను ఉపేక్షించొద్దని కోరారు. హరీశ్‌రావు, సంతోష్ వెనుక రేవంత్‌రెడ్డి ఉన్నారని, కాపాడుతున్నారని, వాళ్ల సోషల్ మీడియా బ్యాచ్ రేపట్నుంచి తనపై దుష్ప్రచారం చేస్తారని, సోషల్ మీడియాలో తనపై నరకం చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు కేసీఆర్ అంటే మహానాయకుడు అని దేశవ్యాప్త పేరు ఉందని, రేపట్నుంచి కేసీఆర్ పేరు చెబితే సీబీఐ పేరు కూడా వినిపిస్తుందని, పెద్దసార్ వద్దకు వచ్చాక కాంప్రమైజ్ అయ్యే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. తనని రేవంత్‌రెడ్డి, బీజేపీ, బండి సంజయ్ నడిపిస్తున్నారని రేపట్నుంచి అంటారని జోస్యం చెప్పారు. నేను కేసీఆర్ బిడ్డను ఖబడ్దార్ ఒకరు నడిపిస్తే నడిచే వ్యక్తిని కాదని వెల్లడించారు.

**కడిగిన ముత్యంలా కేసీఆర్ బయటికొస్తారు**

కేసీఆర్ హిమాలయ పర్వతం లాంటి వారని కవిత అన్నారు. నాకు పెళ్లి చేసేందుకు కూడా మా నాన్న ఇబ్బంది పడ్డారు... అలాంటి దేవుడి లాంటి వ్యక్తిపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించడం బాధగా ఉందని అన్నారు. కేసీఆర్‌ను నిన్న అన్ని మాటలు అంటుంటే ఒక్కరు కూడా నోరు విప్పకపోవడం ఏమిటని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై బిల్లు పెడతారు కానీ సుప్రీం కోర్టు వరకు వెళ్లి ఎందుకు పోరాడటం లేదని ప్రశ్నించారు. బీహార్ కోసం తెలంగాణ బీసీ బిడ్డలను బలి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐ కాదు.. ఇంకే విచారణ జరిపినా కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు.

### కవిత కన్నీళ్ళు

నేను ఇలా మాట్లాడితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నష్టం జరగొచ్చు. అయినా సరే, నా తండ్రి గౌరవం కాపాడటానికి తప్పకుండా నిజం చెబుతాను. బీఆర్ఎస్ భవిష్యత్తు ఎలా ఉండాలో ఈ పరిణామాలే నిర్ణయిస్తాయి. ఒకవేళ కేసీఆర్‌పై విచారణ కొనసాగితే పార్టీ నిలబడగలదా అన్న ప్రశ్నను ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కవిత అన్నారు. ఇన్ని రోజులుగా పార్టీ భవిష్యత్తు దృష్ట్యా ఓర్పు ప్రదర్శించానని.. హరీష్ రావు, సంతోష్ రావుల పేర్లు బయటకు తీయకుండా ఆగానని తెలిపారు. అయితే ఇప్పుడు మౌనం వహిస్తే ప్రజలు కేసీఆర్‌నే తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందని.. అందుకే నిజాన్ని బహిర్గతం చేయాల్సి వచ్చిందని అన్నారు. తొక్కలో ఎలక్షన్ ఒకటి గెలుస్తం.. ఇంకోటి ఓడతం. కానీ పరువు ముఖ్యమన్నారు. మరక అంటింది.. వేలెత్తిచూపేది తమ తండ్రినని, వారికి పైసలు మాత్రమే కావాలని అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నారు.

### కేసీఆర్ ను అడ్డుపెట్టుకుని సంపాదించారు

కేసీఆర్ తెలంగాణ కోసం ఎంతో చేశారని కవిత అన్నారు. ఆయనకు తిండిమీద కూడా ధ్యాన ఉండదని అన్నారు.. దేవుడి లాంటి తన తండ్రిపై సీబీఐ ఎంక్వైరీ వేయిస్తారంటే తన కడుపు రగులుతోందని చెప్పారు. ఇప్పటి వరకు దేశంలో తెలంగాణ తెచ్చిన ధీరుడిగా ఉన్న తన తండ్రి పేరుకు మచ్చ తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై కేసీఆర్ అంటే సీబీఐ కేసా అని అందరూ అంటారని అన్నారు. తన తండ్రి పరువు పోతే తమ ఇజ్జత్ కూడా పోతుందని అన్నారు. కేసీఆర్ మీద ఎంక్వైరీ వేస్తే పార్టీ -స్పందించదా..? అని ప్రశ్నించారు. తొక్కలో ఎలక్షన్ ఒకటి పోతే పోతది కావచ్చునని, పరువు ముఖ్యమని కవిత ఆవేదన చెందారు. విచారణల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం టైంపాస్ చేస్తోందని అన్నారు. పీసీ ఘోష్ కమిషన్ వేసిన ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు అప్పగించడం ఏమిటని ప్రశ్నిం చారు. హరీష్ రావు, సంతోష్ రావు వలన కేసీఆర్ సీబీఐ విచారణ ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ను అడ్డుపెట్టుకుని హరీష్ రావు, సంతోష్ రావు సొంత ఆస్తులు, వనరులు పెంచు కున్నారని అన్నారు. ఇంత జరుగుతున్నా కేసీఆర్ వాళ్ళను భరిస్తున్నారని అన్నారు.

## సీబీఐ అనగానే ఎందుకు జంకుతున్నారు?

**పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్**

**కాళేశ్వరం అవినీతి తేలిపోయింది.. కవితే నిర్ధారించింది**



**హైదరాబాద్, మహా:** సీఎం రేవంత్ రెడ్డిపై కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలను పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఖండించారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తేలిపోయిందని స్పష్టం చేశారు. కాళేశ్వరంలో తప్పు చేసింది కేసీఆరా? లేదా హరీశ్ రావా? అనేది తమకు అనవసరమన్నారు. వారి ప్రభుత్వ హయాంలోనే ఈ స్కాం జరిగిందనేది స్పష్టమైందని తెలిపారు. కవిత సైతం ఇప్పుడు అదే చెప్పారంటూ పీసీసీ చీఫ్ కుండబద్దలు కొట్టారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో మామ కేసీఆర్ వాటా ఎంత..? అల్లుడు హరీశ్ రావు వాటా ఎంత..? అనేది తేలాల్సి ఉందన్నారు. కేసీఆర్ కుటుంబంలో మూడు ముక్కలాట ఫైనల్‌కి చేరిందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. అయినా.. కుటుంబ కలహాలను తమపై రుద్దడం ఏంటంటూ కవితపై ఈ సందర్భంగా ఆయన మండిపడ్డారు. ఏమీ తప్పు చేయలేదంటున్న బీఆర్ఎస్ నేతలు.. సీబీఐ అనగానే ఎందుకు జంకుతున్నారంటూ వారిని సూటిగా ప్రశ్నించారు. వారు తప్పు చేయకపోతే విచారణ ఎదుర్కోవాలని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. మొదటి దఫా ప్రభుత్వంలో ఇరిగేషన్ మంత్రిగా హరీశ్ రావు తప్పు చేస్తే.. ఆయనపై అప్పటి సీఎం కేసీఆర్ బాధ్యతగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

## శాసన మండలిలో రచ్చ రచ్చ

**చైర్మన్‌పై పేపర్లు విసిరిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు**

**బీసీలకు అవకాశాలు పెరగాలని తీన్మార్ మల్లన్న డిమాండ్**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ శాసన మండలిలో భారత రాష్ట్ర సమితి సభ్యులు ఆందోళనకు దిగారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను సీబీఐకి అప్పగించనున్నామని శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించగా, దీనికి వ్యతిరేకంగా మండలి ఛైర్మన్ పోడియాన్ని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీలు చుట్టుముట్టి నినాదాలు చేశారు. జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక ప్రతులను బీఆర్ఎస్ సభ్యులు చించివేసి ఛైర్మన్ వైపు విసిరారు. భారత రాష్ట్ర సమితి సభ్యుల తీరుపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. పోడియం వద్దకు రావొద్దని.. కేటాయించిన స్థానాల్లోనే నిరసన తెలపాలని సూచించారు. అందుకు పోటీగా అధికార పార్టీ సభ్యులు కూడా నినాదాలు చేశారు. దీంతో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభ్యులను వారి వారి స్థానాల్లోకి వెళ్లాలని పదే పదే విజ్ఞప్తి చేశారు. అయినా.. బీఆర్ఎస్ సభ్యులు వినకపోవడంతో ఛైర్మన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మధ్యలో మంత్రి పొన్నం ప్రభాకర్ కలుగజేసుకుని స్థానిక సంస్థల్లో 42 బీసీ బిల్లును ప్రవేశపెడుతున్నట్లుగా ప్రకటించారు. అందుకు వారు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు ఎవరూ సమగ్ర సర్వేలో పాల్గొనలేదని.. కడుపులో కత్తులు పెట్టుకుని మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కూడా 42 శాతం రిజర్వేషన్‌కు మద్దతు ఇవ్వాలని బిల్లును ప్రవేశపట్టారు. అయితే, బీఆర్ఎస్ ఆందోళన మధ్య ఎలాంటి చర్చ లేకుండానే బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందింది. బీసీ బిల్లు అంశంపై మాట్లాడుతూ బీసీల సమస్యలను తీన్మార్ మల్లన్న ప్రస్తావించారు. విద్య, ఉద్యోగ, కాంట్రాక్టుల్లో బీసీలకు అవకాశాలు పెరగాలని, రాజకీయంగా అవకాశాలు పెరగాలని.. ముదిరాజ్ , గంగపుత్రుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు.

## కేసీఆర్‌తో కీలక నేతల భేటీ

- హరీష్ వెంటే పార్టీ.. కవిత పై వేటే?
- కవిత వ్యాఖ్యలపై.. కలకలం
- కవిత పీఆర్వోను పార్టీ అధికారిక గ్రూపు నుండి తొలగింపు
- ఆరడుగుల బుల్లెట్టు అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్ట్
- దీనిని షేర్ చేసి సంఘీభావం ప్రకటించిన కేటీఆర్



**హైదరాబాద్:** ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, సంతోష్ రావులపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో కవితపై బీఆర్ఎస్ ఎలాంటి చర్యలు తీసుకోబోతుంది అనేది ఆసక్తికరంగా మారింది. కవిత కామెంట్స్ తర్వాత ఫాంహౌస్‌లో కేసీఆర్‌తో కేటీఆర్, మధుసూదనాచారీ, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీష్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డిలతో సమావేశం సమావేశమైనట్లు సమాచారం. కవిత కామెంట్స్‌పై పార్టీ నేతలతో కేసీఆర్ చర్చించారు. నేడో.. రేపో.. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాల నుంచి వినబడుతోంది. హరీష్‌రావు కూతురితో కలిసి లండన్ వెళ్ళిన సమయంలో ఈ ఆరోపణలు రాగా, పార్టీ ముఖ్యులు మద్దతుగా నిలవాలని నిర్ణయించారు.

**బీఆర్ఎస్ కౌంటర్**

ఇప్పటికే.. కవిత వ్యాఖ్యలకు బీఆర్ఎస్ కౌంటర్ ఇచ్చింది. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో హరీష్ రావు ఆరడుగుల బుల్లెట్ అంటూ ట్వీట్ చేసింది. దానితో పాటు బీఆర్ఎస్ మీడియా వాట్సాప్ గ్రూప్స్ నుంచి కవిత పీఆర్వోను బీఆర్ఎస్ తొలగించింది. వీడియోలు కూడా డిలిట్ చేసింది.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు పట్ల కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

- కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సేవాభవన్ నుండి ర్యాలీ
- కాంగ్రెస్ ప్రముఖుల ఫ్లెక్సీలకు పాలాభిషేకం
- ఇది చారిత్రాత్మక నిర్ణయమన్న కంది శ్రీనివాస రెడ్డి
- బీసీలకు తగిన సత్కారమని వెల్లడి

**ఆదిలాబాద్ మహా :** అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవ ఆమోదం పట్ల ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఏఐసీసీ టీపీసీసీ ఆదేశాల మేరకు సంబరాలు జరుపుకున్నారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసేవ భవన్ నుంచి సోమవారం పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులతో ర్యాలీ నిర్వహించారు. రేవంత్ రెడ్డికి ప్రభుత్వానికి మద్దతుగా పెద్దపెట్టున నినాదాలు చేశారు .బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రముఖుల ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు .బిల్లు ఏకగ్రీవ ఆమోదం పొందడం పట్ల బీసీ లందరూ ఎంతో గర్విస్తున్నారని అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇది చారిత్రాత్మక నిర్ణయం అన్నారు.. ఒక ఓసి ముఖ్యమంత్రి అయి ఉండి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయటాన్ని ఆయన స్వాగతించారు. ఇది బీసీ లందరికీ గర్వకారణం అన్నారు. స్పెషల్ ఆర్డినెన్స్ ద్వారా ఖచ్చితంగా స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలై తీరుతుందన్నారు. ఆరు నూరైనా బీసీ బిడ్డలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు సరైన న్యాయం చేసిందన్నారు .42 శాతం రిజర్వేషన్ తో సత్కరించిందన్నారు. ఈ బిల్లు పట్ల కేవలం బీసీలు మాత్రమే కాకుండా ప్రజలందరూ కూడా హర్షిస్తున్నారన్నారు. బిజెపి బీఆర్ఎస్ లు బీసీలను కేవలం ఓటు బ్యాంకు గానే చూశాయని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాళ్లకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి సరైన న్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆర్జీవీతో డ్యాన్స్ చేయించిన జగపతి బాబు..

టాలీవుడ్ సీనియర్ హీరో జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న జీ తెలుగు రియాలిటీ టాక్ షో జయమ్ము నిశ్చయమ్మురా శ్రోతలను ఎంతగానో అలరిస్తోంది. ప్రతి వారం ప్రత్యేక అతిథులతో వినోదాన్ని పంచే ఈ షోకు తాజా ఎపిసోడ్ మరింత స్పెషల్‌గా మారింది. ఈ వారం గెస్టులుగా సెన్సేషనల్ డైరెక్టర్లు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ), సందీప్ రెడ్డి వంగా హాజరై షోకు హైలైట్‌గా మారనున్నారు. ఇద్దరూ సినిమాల పరంగా ఎంత విభిన్నమైన శైలిలో ఉన్నా.. ఒకే స్టేజ్‌పై కలిసినప్పుడు మాత్రం నవ్వులు, సరదా, కాస్త ఫైర్‌తో ప్రేక్షకులని అలరిస్తుంటారు. తాజాగా షోకి సంబంధించిన ప్రోమో విడుదల కాగా, ఇందులో ఇద్దరూ కలిసి చేసిన చిలిపితనం, జోక్స్, బోల్డ్ కామెంట్లు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా సందీప్ వంగా – "ఆర్జీవీ నా ఫేవరెట్ డైరెక్టర్" అని కొన్నిసార్లు చెప్పిన నేపథ్యంలో, వీరిద్దరూ కలిసి మాట్లాడిన అంశాలు ఆసక్తికరంగా మారాయి. ఆర్జీవిని సైతాన్ అని జగపతి బాబు అనడం, డెవిల్-యానిమల్ పక్క పక్కనే ఉంటే ఎంత ముద్దుగో ఉందో అని చెప్పడం ప్రోమోకి హైలైట్‌గా మారాయి. మరోవైపు ప్రోమో మొదట్లో ఆర్జీవి డ్యాన్స్ వేయడం కూడా షోకి హైలైట్. మొత్తానికి ఈ ఎపిసోడ్ మాత్రం ప్రేక్షకులకి ఫుల్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ మాస్ కాంబినేషన్ ఎపిసోడ్‌ను సెప్టెంబర్ 7, ఆదివారం రాత్రి 9 గంటలకు జీ తెలుగులో ప్రసారం చేయనున్నారు. ప్రోమో చూసినవాళ్లు మాత్రం .. "ఫుల్ ఎపిసోడ్ ఎప్పుడొస్తుందా?" అంటూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## టాలీవుడ్ రొమాంటిక్ లవ్ స్టోరీ..

### క్రేజీ సాంగ్ వచ్చేసింది!

అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటిస్తోన్న తాజా యూత్ ఫుల్ లవ్ స్టోరీ బ్యూటీ. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లేని ఆర్వీ సుబ్రహ్మణ్యం అందించగా.. జేఎస్ఎస్ వర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీని జీ స్టూడియోస్, మారుతీ టీం ప్రొడక్ట్స్, వానర సెల్యూలాయిడ్ బ్యానర్లపై విజయపాల్ రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి క్రేజీ లవ్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ప్రెట్టీ ప్రెట్టీ అంటూ రొమాంటిక్ పాటను మేకర్స్ విడుదల చేశారు. ఇప్పటికే రిలీజైన గ్లింప్స్, మోషన్ పోస్టర్, పాటలు, టీజర్ ఆడియన్స్‌ను ఆకట్టుకున్నాయి. ఈ తాజా లవ్ సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. ఈ పాటకు విజయ బుల్గానిన్ సంగీతమందించగా.. సనారే లిరిక్స్ రాశారు. ఈ రొమాంటిక్ సాంగ్‌ను పీవీఎన్ఎస్ రోహిత్ పాడారు. ఈ సినిమాను సెప్టెంబర్ 19న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో నరేష్, వాసుకి, నంద గోపాల్, సోనియా చౌదరి, నితిన్ ప్రసన్న, మురళీ గౌడ్, ప్రసాద్ బెహరా కీలక పాత్రల్లో నటించారు.

## హారర్ ఫ్రాంచైజీలోకి రష్మిక..

## దెయ్యం పాత్రలో!

ప్రస్తుత పాన్ ఇండియా ట్రెండ్‌లో ఎక్కువగా సక్సెస్ అయిన హీరోయిన్ రష్మిక. గత కొన్నేళ్లలో యానిమల్, ఛావా, పుష్ప 2 తదితర చిత్రాలతో ఈమె రేంజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. అయితే ఒకే తరహా చిత్రాలు అని కాకుండా డిఫరెంట్ పాత్రలు చేస్తూ బిజీగా ఉంది. ప్రస్తుతం ఈమె చేతిలో 'గర్ల్ ఫ్రెండ్' అనే ఫీమేల్ ఓరియెంటెడ్ మూవీ, అలానే 'థామా' అనే హారర్ చిత్రంలోనూ చేస్తోంది. 'థామా' హిందీ సినిమా. ఇందులో వ్యాంపైర్ తరహా పాత్ర రష్మిక కనిపిస్తుందని రూమర్స్ వినిపిస్తున్నాయి. అలానే దెయ్యంగానూ కనిపించే అవకాశాలున్నాయని మాట్లాడుకుంటున్నారు. ఇప్పుడు దక్షిణాదిలో తీసే హారర్ చిత్రంలోనూ రష్మికకు క్రేజీ ఆఫర్ వచ్చిందని, ఇందులో ఈమె దెయ్యంగా నటించనుందని అంటున్నారు. ఇదంతా కాంచన 4 కోసమే అని సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే మాత్రం ఈ ప్రాజెక్ట్‌పై హైప్ పెరగడం గ్యారంటీ. కొరియోగ్రాఫర్ నుంచి హీరోగా మారిన రాఘవ లారెన్స్.. 'కాంచన' సిరీస్‌తో చాలా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ ఫ్రాంచైజీలో ముని, కాంచన, కాంచన 2, కాంచన 3 చిత్రాలు వచ్చాయి. ప్రస్తుతం నాలుగో భాగం షూటింగ్ జరుగుతోంది. ఇందులో పూజా హెగ్డే హీరోయిన్. ఈ విషయాన్ని ఇదివరకే బయటపెట్టారు. ఇప్పుడు రష్మిక కూడా ఈ ప్రాజెక్టులో భాగమైందని, దెయ్యంగా కనిపించబోతుందని టాక్ వినిపిస్తుంది. మరి ఇది ఎంతవరకు నిజమనేది తెలియాల్సి ఉంది. సాధారణంగా కాంచన సిరీస్ సినిమాల్లో ముగ్గురు నలుగురు హీరోయిన్లు ఉంటారు. రూమర్స్ బట్టి చూస్తుంటే రష్మిక.. దెయ్యం పాత్ర చేయడం నిజమేనేమో అనే సందేహం కలుగుతుంది. ఒకవేళ ఇది ఫిక్స్ అయితే మాత్రం రష్మికని ఎలా చూపిస్తారనే ఆసక్తి కచ్చితంగా ఏర్పడుతుంది.



## రుక్మిణి చేతిలో క్రేజీ ప్రాజెక్ట్స్ ..

### తారక్-నీల్ సినిమాలోనూ

రుక్మిణి వసంత్. ఈ హీరోయిన్ గురించి తెలుగు ప్రేక్షకులకు పెద్దగా తెలీదు. ఎందుకంటే ఈమె స్వతహాగా కన్నడ. కానీ 'సప్త సాగరాలు దాటి' అనే డబ్బింగ్ మూవీతో మనోళ్లకు కాస్త పరిచయం. అలాంటిది ఇప్పుడు 'మదరాశి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఇది కాదు అసలు విషయం. ఈమె చేతిలో క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్టులు ఉన్నాయి. ఆ లైనప్ చూస్తేనే మిగతా హీరోయిన్స్ అసూయ పడతారేమో అనిపిస్తుంది. శివకార్తికేయన్-మురుగదాస్ కాంబోలో తీసిన 'మదరాశి'లో రుక్మిణి వసంత్ హీరోయిన్. అయితే ఈ సినిమాలో ఈమె పాత్రకు ఎంత ప్రాధాన్యం ఉందనేది తెలీదు. బేసిగ్గా ఈ మూవీపై పెద్దగా అంచనాల్లేవు. కానీ ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ వేడుకలో మాట్లాడిన నిర్మాత ఎన్వీ ప్రసాద్.. ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్ అని బయటకు చెప్పేశారు. అలానే కాంతార సీక్వెల్, యష్ 'ట్యాక్సిక్'లోనూ ఈమెనే కథానాయిక అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం పాన్ ఇండియా లెవల్లో హిట్స్ కొడుతూ వరస సినిమాలు చేస్తున్న హీరోయిన్ అంటే అందరికీ రష్మికనే గుర్తొస్తుంది. కానీ రుక్మిణి వసంత్ లైనప్ చూస్తుంటే రష్మికలానే ఈమె కూడా నెక్స్ట్ పాన్ ఇండియా సెన్సేషన్ అవుతుందేమో అనిపిస్తుంది. ఎందుకంటే వచ్చే నెలలో రాబోతున్న 'కాంతార' సీక్వెల్‌లో ఈమె యువరాణి పాత్ర చేసింది. అలానే వచ్చే ఏడాది మార్చిలో ట్యాక్సిక్, వేసవిలో నీల్-తారక్ మూవీ థియేటర్లలోకి రానుంది. ఇవన్నీ కచ్చితంగా హిట్ బొమ్మల్లానే కనిపిస్తున్నాయి. ఒకవేళ అదే జరిగితే మాత్రం రుక్మిణి.. మోస్ట్ వాంటెడ్ అయిపోవడం గ్యారంటీ. రీసెంట్‌గా మొదలైన వెంకటేశ్-త్రివిక్రమ్ సినిమాలోనూ హీరోయిన్‌గా రుక్మిణి వసంత్‌ని తీసుకోవాలని అనుకుంటున్నట్లు రూమర్స్ వస్తున్నాయి. మరి ఇందులో ఎంత నిజముందనేది మరికొన్ని రోజుల్లో క్లారిటీ రావొచ్చు. కెరీర్ ప్రారంభం నుంచి చాలా సెలక్టివ్‌గా సినిమాలు చేస్తున్న ఈ బ్యూటీ భవిష్యత్తు.. రాబోయే 10 నెలల్లో ఏ మేరకు మారబోతుందో చూడాలి?





## అదితి శంకర్‌కు మరో ఛాన్స్

స్టార్ డైరెక్టర్ శంకర్ వారసురాలు అదితి శంకర్ అనే విషయం తెలిసిందే. కార్తీకి జంటగా విరుమాన్ చిత్రంతో కథానాయకిగా, గాయనిగా ఒకేసారి పరిచయమైన ఈ బ్యూటీ తొలి చిత్రంతోనే మంచి విజయాన్ని అందుకున్నారు. ఆ తర్వాత శివకార్తికేయన్‌కి జంటగా మావీరన్ చిత్రంలో నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. అయితే ఆ తర్వాత ఆకాష్ మురళి హీరోగా పరిచయమైన తమిళ చిత్రం నేశిప్పాయాలో అదితిశంకర్ నాయకిగా నటించారు. ఆ చిత్రం నిరాశపరిచింది. అదేవిధంగా తెలుగులో ఈమె ఎంట్రీ ఇచ్చిన భైరవం చిత్రం కూడా ఆశించిన విజయాన్ని సాధించలేదు. దీంతో కాస్త వెనకపడ్డ అదితి ప్రస్తుతం అర్జున్‌దాస్‌కు జంటగా ఒక చిత్రం చేస్తున్నారు. ఈ చిత్రం నిర్మాణ దశలో ఉండగానే తాజాగా మరో అవకాశం ఆమెకు తలుపు తట్టినట్లు తాజా సమాచారం. ఇంతకుముందు ఈరం, కుట్రం 23 వంటి థ్రిల్లర్ కథా చిత్రాలతో మంచి విజయాన్ని అందుకున్న దర్శకుడు అరివళగన్. తాజాగా తెరకెక్కించనున్న చిత్రంలో అదితిశంకర్‌ను కథానాయకిగా నటింపజేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఇది ఉమెన్ సెంట్రిక్ కథా చిత్రంగా ఉంటుందని సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన పూర్తి వివరాలతో త్వరలో వెలువడే అవకాశం ఉంది. అరివళగన్ దర్శకుడు శంకర్ శిష్యుడు అన్నది గమనార్హం. దీంతో ఈయన తన గురువుగారి వారసురాలుని తెరపై ఏ విధంగా ఆవిష్కరించనున్నారో అనే ఆసక్తి ప్రేక్షకుల్లో ఇప్పటినుంచే నెలకొంటోంది. ఎందుకంటే అదితిశంకర్ ఇప్పటివరకు ఉమెన్ సెంట్రిక్ కథా చిత్రంలో నటించలేదు.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034